పోలీసు కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం

జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆర్మీడ్ రిజర్వ్ విధులు నిర్వర్తిస్తూ గత సంవత్సరం సెప్టెంబర్‌లో అనారోగ్యంతో మరణించిన కీర్తి శేషులు కె.నాగేశ్వరరావు (ఏఆర్ పీసీ-4483) భార్య కె.అచ్చమ్మకి విడో ఫండ్ కింద రూ.50,000 చెక్కును గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మల్లికగర్గ్ అందచేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు చదువు తదితర అంశాలపై చర్చించి వారి కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఏదైనా సమస్య ఉన్న నేరుగా తనను కలవవచ్చుని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ యం.సులోచన పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించాలని జిల్లా కలెక్టర ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న ఒంగోలులోని ఏకెవికె కాలేజీని తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు వారికి పరీక్షా కేంద్రంలో కల్పించిన సదుపాయాలపై ఆయన ఆరా తీవారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఏ విధమైన ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఇతర సిబ్బంది కూడా సెల్‌ఫోన్‌తో విధులలో పాల్గొనరాదని ఆయక చెప్పారు. పరీక్షల నిర్వహణ విధులలో ఉల్లంఘన జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసు కుంటామని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు మినహా ఇతరులెవరిని పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితులలోను అనుమతించరాదని స్పష్టం చేశారు.

మళ్లీ నిరాసే

- జిల్లాకు బడ్జెట్‌లో మొండిచేయి
- కనీస కేటాయింపులు లేని వెలిగొండ ప్రాజెక్టు
- ఊసే లేని పారిశ్రామిక అభివృద్ధి
- విద్యారంగం నిధులు కేటాయింపుపై నిర్లక్ష్యం
- బటన్ నొక్కుళ్లకే ప్రాధాన్యత
- బడ్జెట్‌పై విపక్షాలు ధ్వజం
- హర్షం వ్యక్తం చేస్తున్న అధికార పార్టీ నేతలు

విశాలాంధ్ర-ఒంగోలు : బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాకు ముఖ్యమంత్రి మొండిచెయ్యి చూపారని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. వెలిగొండ ప్రాజెక్టుకు అరకొర నిధులు కేటాయింపు అక్కడి ఉద్యోగుల జీతాలకు కూడా సరిపోవంటున్నారు. అలాగే జిల్లాకు కేటాయించిన ప్రకాశం యూనివర్సిటీ నిర్మాణ ఊసే లేదని, పారిశ్రామిక అభివృద్ధికి కేటాయిం పులు ఎక్కడా అని ప్రతిపక్షాలు కన్నెర్ర జేస్తున్నాయి. కేవలం బటన్ నొక్కుడు కార్యక్రమాలకు మాత్రమే నిధులు కేటాయించారని, నిరుద్యోగ సమస్యను విస్మరించారని ధ్వజమెత్తుతున్నారు. అయితే దీనికి విరుద్ధంగా అధికార పార్టీ నాయకులు మాత్రం బడ్జెట్ అద్భుతం, అమోఘం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు.

మరోసారి జిల్లా ప్రజలకు మోసం

– సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ

ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి ఎన్నికలకు వస్తామని ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయంగా ప్రకటించినందున ఈసారి బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయి స్తారని జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో కేటాంపులు జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లయని, మరోసారి జిల్లా ప్రజలను జగన్ ప్రభుత్వం మోసగించింది. జిల్లా అభివృద్ధి ఊసే ఈ బడ్జెట్లో లేకపోవడం అన్యాయం. బడ్జెట్ ప్రసంగంలో వెలిగొండ మొదటి టన్నాల్ పూర్తిచేస్తామని ప్రస్తావించడం మోసగించడం కాదా. ప్రాజెక్ట్ ఈ సంవత్సరం పూర్తిచేయాలంటే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజితో సహా 5వేలకోట్లు అవసరమని ఇంజనీర్ లు చెబుతుంటే అరకొర నిధులు కేటాంచడం ఖచ్చితంగా మోసగించడమే. మొత్తం రాష్ట్ర బడ్జెట్ అంకెలగారడి బడ్జెట్. 1వ తేది ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం 2.79లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టింది. ఏ సంవత్సరం బడ్జెట్ లో సంగభాగం కూడా ఖర్చు చేయలేని ప్రభుత్వం 14శాతం జిడిపి వృద్ధి రేటు సాధించామని ప్రకటించడంచూస్తుంటే "ఆస్తిమూరెడు-ఆశబారెడు" చందంగా బడ్జెట్ బారెడు - ఖర్చు మూరెడు లా ఉందనడంలో అతిశయోక్తి లేదనే చెప్పాలి.

పేదల అభివృద్ధికి పెద్ద పీట

– ఎంపీ మాగుంట

2023-24 సంవత్సరానికి రూ. 2,79,279 కోట్లతో నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సంక్షేమ పథకాలకు సంభందించి వై.ఎస్.ఆర్. పెన్షన్ కానుకకు 21,434 కోట్లు, వై.ఎస్.ఆర్. రైతు భరోసాకు కోట్ల, జగనన్న విద్యాదీవెనకు 2,841 కోట్లు, వై.ఎస్.ఆర్. చేయూతకు 5,000 కోట్లు, వై.ఎస్.ఆర్. పంటల భీమా 372 కోట్లు, వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీకి 1,600 కోట్ల, వై.ఎస్.ఆర్. నేతన్న నేస్తానికి 200 కోట్లు, జగనన్న తోడుకు 35 కోట్లు, వై.ఎస్.ఆర్. ఆసరాకు 6,700 కోట్లు,వై.ఎస్.ఆర్. కాపు నేస్తానికి 550 కోట్లు, జగనన్న అమ్మ ఒడికి 6,500 కోట్లు, జగనన్న విద్యా కానుకకు 560 కోట్లు, వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీకి 1,600 కోట్లుతోపాటు తదితర సంక్షేమ పథకాలకు కేటాయించారు. మిగతా రంగాలకు సంభందించి, వ్యవసాయ శాఖకు 11,589 కోట్లు, నీటి పారుదలకు 11,908 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు 15,582 కోట్లు, విద్యా శాఖకు 31,754 కోట్లు, గ్రామీణాభివృద్ధికి 15,873 కోట్లు, పట్టణాభివృద్ధి శాఖకు 9,381 కోట్లు, రోడ్లు భవనాల శాఖకు 9,118 కోట్లు, విద్యుత్ శాఖకు 6,546 కోట్లు, పరిశ్రమల శాఖకు 2,602 కోట్లు, ప్రజా పంపిణీకి 3,725 కోట్లు, సచివాలయాలకు 3,858 కోట్లు, మనబడికి 3,500 కోట్లు, గృహాలకు 5,600 కోట్లు, నైపుణ్యాభివృద్ధికి 1,116 కోట్లు, అటవీ-పర్యాటకానికి 685 కోట్లు కేటాయింపుతోపాటు తదితర రంగాలకు కూడా సముచితంగా నిధులు కేటాయించారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

– సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి

అసెంబ్లీలో 279279 కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెడుతూ రాష్ట్రంలో మొత్తం 62శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి ఉందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. కానీ వ్యవసాయ యాంత్రీకరణ పేరుతొ బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టే దానితో కలిపి కూడా కేవలం 4శాతం నిధులు మాత్రమే వ్యవసాయ రంగానికి కేటాయిం చడం జరిగింది. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితుల్లో రైతు కుటుంబాలకు పరిహారం కోసం రూ.20 కోట్లు, రైతులకు వడ్డీ లేని ఋణాల కోసం రూ.500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం గడప గడపకీ మన ప్రభుత్వం పేరుతో తమ రాజకీయ ప్రచారానికి మాత్రం 532 కోట్లు కేటాయించడం సిగ్గుచేటు. ప్రత్యక్ష నగదు బదిలీ పేరుతొ రూ.54228 కోట్లు జనానికి పంచుతున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం అంతకు మించి రూ.54587 కోట్లు అప్పుల భారాన్ని కూడా రాష్ట్ర ప్రజల నెత్తిన పెడు తుంది. అప్పుల విషవలయం నుండి గట్టెక్కించాలనే ఉద్దేశ్యం ప్రభు త్వానికి లేనందునే మూలధన వ్యయాన్ని కేవలం 11 శాతానికి పరిమితం చేశారు. ఉద్యోగుల జీతభత్యాలకు మాత్రం రాష్ట్రం కష్టాల్లో ఉందంటూ రెండు నాల్కల దోరణి ప్రదర్శిస్తున్నారు.

వ్యవసాయ, నీటిపారుదల శాఖలకు అరకొర కేటాయింపులు

– సీఎస్ సాగర్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి

అసెంబ్లీలో 2023- 24 ఆర్థిక సంవత్సర బడ్జెట్లో 2,29,274కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత సంవత్సరంతో పోలిస్తే అదనంగా సుమారు 23 వేల కోట్ల కేటాయించిన, వ్యవసాయ రంగానికి 11,589 కోట్లు ,నీటిపారుదల రంగానికి 11,908 కోట్లు అరకొర నిధులే కేటాయించారు. గ్రామీణ ప్రజల ఆదాయాలు పెంచే ఈ రంగాల అవసరమైన మేరకు నిధులు పెంచలేదు. కనీసం వెలుగొండ లాంటి ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయిం చలేదు. విద్యారంగానికి 31,754 కోట్లు కేటా యించడం చూస్తే, విద్యార్థులకు ఫీజు రీయం బర్స్మెంట్ పథకం అమలకు, గత సంవత్సరం బకాయిలు చెల్లించడానికి, ప్రస్తుత విద్యా సంవత్సరం ఫీజులు చెల్లించడానికి సరిపడా నిధులు కేటాయించలేదు. అమ్మ ఒడికి 6500 కోట్లు కేటాయింపులు చూస్తే అర్హులైన వారందరికీ ఈ పథకం అమలయేట్లు కనిపించడం లేదు. ప్రజల ఉపాధి అవకాశాలు పెంచే శాశ్వత ప్రాతిపదికన సుస్థిర ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే ఆర్థిక వ్యూహం లేని బడ్జెట్ గా ఈ బడ్జెట్ కూడా చేరిపోయింది.

సిద్ధార్థరెడ్డిని కలిసిన సర్పంచ్ భవనం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : వైయస్సార్సీపి నాయకుడు రాష్ట్ర యూత్ అధ్యక్షుడు సిద్ధార్థరెడ్డిని హను మంతుని పాడు మండల పరిధిలోని ఉన్న దాసర్లపల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయ ఆవరణలో మర్యాదపూర్వకంగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర నాగులుప్పలపాడు : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 122వ జయంతి సందర్భంగా ఉప్పుగుండూరు గాంధీ రోడ్డులోని బొడ్డాయి సెంటర్ వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రమును జోన్ చైర్మన్ టిజివి ప్రసాద్ ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగు తుందని ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు కొంజేటి వెంకట సురేష్ బాబు అమర వేణు పులకణం రాజేష్ క్లబ్ అధ్యక్షులు దేశు రవి సుధాకర్ సామాజిక సేవా కార్యకర్త తెలగ తోటి శామ్యూల్ ఆర్యవైశ్య ప్రముఖులు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు ముత్తుముల ఆశీర్వాదం

విశాలాంధ్ర-అర్ధవీడు : నూతన దంపతులను గిద్దలూరు టీడిపి ఇంచార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆశీర్వా దించారు. మండలంలోని రంగాపురంలో గంగుల రామ లింగమ్మ కుమారుడి వివాహం జరిగింది. ఈ వేడుకలకు హాజరైన ముత్తుముల శేఖర్, పావనీ దంపతులను ఆశీర్వ దించారు. ఆయన వెంట పార్టీ నాయకులు వున్నారు.

పిడుగుపాటుకు ఒకరి మృతి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పిడుగుపాటుకు ఒకరు మృతి చెందిన సంఘటన యర్రగొండపాలెం మండ లంలోని గోళ్ళవీడిపి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసు కుంది. పోలీసుల వివరాలు మేరకు పోలు వెంకటేశ్వర్లు(40) పొలం పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా పిడుగు పడి మృతి చెందాడు. మరో ఇద్దరు స్పృహ తప్పి పడిపోయారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తోడేళ్లుల్లా ఇసుకను తోడేస్తున్నారు!

- 'విశాలాంధ్ర' విలేకరిని చూసి జేసీబీతో సహా పరారైన ఇసుకాసురులు
- పాలేటిగంగ సమీప ప్రాంతాల్లో భారీగా ఇసుక నిల్వలు
- అధికారుల అండదండలతో ఇసుక దందా
- అడ్డుకట్ట వేయడంలో అధికారుల విఫలం
- ఆందోళనలో రైతులు, పట్టించుకోని మైనింగ్ రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-పీసీపల్లి : అధికారులకు మేము అధికార పార్టీ నేతలమంటూ అధికారు లను లోంగబరుచుకొని వాగులలో వంకలలో రాత్రి వేళల్లో జెసిబిల సహాయంతో ఇసుకను తోడేళ్ళలా తోడేస్తున్నారు. గత కొన్ని రోజుల నుండి పాలేటిగంగ పరివాహక ప్రాంతాల్లో రాత్రివేళల్లో జెసిబిల సహాయంతో నిత్యం 10నుంచి 20ట్రాక్టర్లతో వెంగలాపురం, నేరేడు పల్లి గ్రామాల వైపు తరలిస్తూ జనసంచారం లేనిచోట్ల భారీగా ఇసుక నిల్వలు ఉంచు తున్నారు. వెంగాలాపురం నుండి పోతవరం వెళ్లే రహదారిలో, నేరేడుపల్లి గ్రామంలో, పాలేటిగంగ చుట్టుపక్కల భారీగా ఇసుక డంప్‌లు ఉన్నాయి. తెల్లవారుజామున టిప్పర్లకు లారీలకు అదే జెసిబిలతో లోడింగ్ చేయించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అదృష్టం ఉంటే చాలు మట్టి నుండి కోట్లు రాబట్టవచ్చని ఇసుక మాఫియా నిరూపిస్తున్నారు. పీసీ పల్లి మండలంలో వ్యాపారులు ఇసుక వ్యాపారంతో కోట్లు గడిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల లెక్కించుకోవడమే కాకుండా తమ సహకారాన్ని కూడా దళారులకు పుష్కలంగా అందజేస్తున్నారు. డబ్బులు ఇస్తే చాలు వాగులు నదులు దోచుకుంటున్నా పట్టించు కోరు. మండలంలోని వివిధ ప్రాంతాల నుండి ఇసుక అక్రమ రవాణా అధికారుల అండ దండలతో సాగిస్తున్నారు. దళారులు ఏకంగా ఇసుకను స్టాక్ పాయింట్లకు మార్చుకుని అక్కడనుండి రాత్రివేళల్లో తరలిస్తున్నారు. ఈ విధంగా ఇసుక మాఫియా నిరాటంకంగా సాగిపోతుంది. దొరికినంత దోచుకుంటూ అక్రమంగా ఇసుకను కావాల్సిన ప్రాంతాలకు తరలిస్తున్నారు. మండలంలో ఇసుక మాఫియా అసలు అధికారులు ఉన్న సంగతి మర్చిపోయి మరీ ఇసుకను తవ్వేస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇసుకే బంగారం అయింది. అదే అక్రమార్కులకు వరంగా మారింది. అందువల్ల పాలేరు నదులకు శాపమైంది. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రింబవళ్ళు ట్రాక్టర్లు, టిప్పర్లకు జెసిబిల సహాయంతో ఇసుకను తరలిస్తున్నారు. ఇలా ఇసుకను తరలిస్తూ లక్ష రూపాయలు దళారులు సొమ్ము చేసు కుంటున్నారు. పీసీ పల్లి మండలానికి చెందిన వారే అంతేకాకుండా అదికార పార్టీ నేతలు కావడంతో వాళ్ల ఇసుక తరలింపు కు అడ్డు అదుపు లేకుండా పోతుంది. గ్రామాలకు చెందిన పలువురు ట్రాక్టర్ యజమానులు భాగస్వాములుగా దళారులు ఏర్పాటు చేసుకుని అక్కడ అక్రమంగా ఇసుకను రాత్రికి రాత్రి జెసిబిల సహాయంతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దళారులకు కొందరు అధికారులు సహాయ సహకారాలు ఉన్నాయని ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేసినా తమపై బెదిరింపులకు పాల్పడు తున్నారని ప్రజలు అంటున్నారు. మండలంలోని వెంగాలాపురం, పాలేరు, పెదఅలవలపాడు, పాలేటిగంగ, తదితర ప్రాంతాలనుండి జెసిబిల సహాయంతో రాత్రివేళల్లో భారీగా ఇసుక డంప్ చేస్తున్నారు.

కాసులు కురిపిస్తున్న ఇసుక వ్యాపారం

మండలంలోని పలు గ్రామాల్లో చుట్టుపక్కల ఇసుక వ్యాపారం జెసిబిలతో సాగుతుంది. ఒక ట్రక్కు ఇసుక నింపితే 600 వరకు చెల్లించి యజమానులు 5 వేల నుండి 7వేల వరకు అమ్ముకుంటున్నారు. అదే టిప్పర్ అయితే దాదాపుగా 25 వేల రూపాయలకు అమ్ముకుంటున్నారు. రోజుకు వందల ట్రాక్టర్ ఇసుక స్టాక్ పాయింట్లకు మరియు కనిగిరి వెలిగండ్ల, హెచ్ఎం పాడు, పొట్లగూడూరు, పొన్నలూరు ఇతర ప్రాంతాలకు తరలి స్తున్నారు. వీరికి గ్రామాల్లో ఉండే పోట, అధికార పార్టీ నాయకులు అండదండలు పుష్కలంగా ఉండడంతో వీరు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా జరుగుతుంది.

పట్టించుకోని మైనింగ్ రెవెన్యూ అధికారులు :

మండలంలోని పెదఅలవలపాడు, నేరేడుపల్లి, పాలేటిగంగ పాలేటి నదుల్లో మనిషిలోతు గుంతలు తీసి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా రాత్రివేళల్లో జెసిబిల సహాయంతో వాగులు వంకలలోని ఇసుక స్టాక్ పాయింట్లకు చేరుస్తున్నా అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా అనిపించడం లేదు. ఈ విధంగా అక్రమార్కులు ఇసుకే వ్యాపారంగా చేస్తున్నారంటే దళారుల నుండి అధికారులకు ఏమాత్రం మామూల్లు అంది ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. దళారులు ఇచ్చిన మామూళ్లకు కక్కుర్తిపడి పంట పొలాలకు సమీపంలో ఉండే వాగుల్లో ఇసు కాసురులు పెద్దపెద్ద గుంతలు తీస్తూ వాగు లను నాశనం చేస్తున్నారని ఈ విషయంపై రైతులు అధికారులకు తమ గోడును వెళ్ల బోసుకున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నడంతో ఏం చేయాలో అర్థం కాక రైతులు తలమున కలవుతున్నారు. ఇసును అక్రమంగా తరలించ కుండా దళారుల భరతం పట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలు తుంటే మా బాధను ఇంకెవరికి చెప్పుకోవాలి మహాప్రభో అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఇసుక మాఫియాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములు పోరాట పటిమను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : అమజీవి పొట్టి శ్రీరాములు పోరాట పటిమను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం పొట్టి శ్రీరాములు అజయంతిని పురస్కరించుకుని స్థానిక సీవీఎస్ రీడింగ్‌రూం సమీపంలోని విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలోను, అనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడడంలోను పొట్టి శ్రీరాములు పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. అలాంటి మహనీయుల జీవితాలను నేటితరం ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహశీల్దారు మురళి, ఇతర అధికారుల పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలలో కూడా పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర - నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు గ్రామంలోని పార్క్ సెంటర్ వద్ద అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జోన్ చైర్మన్ టిజే వి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు కొంజేటి వెంకట సురేష్ బాబు క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, గ్రామ పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు అమరా వేణు, పులకణం రాజా, క్లబ్ అధ్యక్షులు దేసు రవి సుధాకర్, సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్, గ్రామ పెద్దలు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో హర్యాన మద్యం

- 636 మద్యం సీసాలు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో హర్యానకు చెందిన అక్రమ మద్యం బయటపడింది. పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి 636(477 లీటర్లు)మద్యం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఇబి ఆఫీసు వద్ద గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా ఎఎస్పీ నాగేశ్వరరావు కేసు తాలుకు వివరాలు తెలుపుతూ జిల్లాలోని నాగులుప్ప లపాడు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన తన్నీరు శబరిగిరి, మొరతోటి నాగార్జున, కుంచాల ప్రవీణ్‌లను అక్రమ హర్యాన మద్యం కేసులో అరెస్టు చేశామన్నారు. వారి నుండి అక్రమ మద్యం బాటిళ్లతో పాటుగా నాలుగు సెల్‌ఫోన్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ ఆదేశాల మేరకు ఎస్ఇబి జెడి కె నాగేశ్వరరావు, ఒంగోలు ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ అవులయ్య ఆధ్వర్యములో అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సుదీర్ బాబు పర్యవేక్షణలో ఈనెల 15న మద్దిపాడు మండలం, గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ పరిదిలోని బూరేపల్లి కాలనీ వద్ద హర్యాన స్టేట్ సంభందించిన లిక్కర్ బాటిల్స్ వున్నాయనే సమాచారం అందుకున్న చీమకుర్తి ఎస్ఇబి సబ్-ఇన్స్పెక్టర్ యం.నగేష్ సిబ్బంది మరియు జాయింట్ డైరెక్టర్ సిబ్బంది, ఒంగోలు వారితో కలిసి దాడులు నిర్వ హించినట్లు తెలిపారు. ఈ దాడులలో ముగ్గురు వ్యక్తులు హర్యానా రాష్ట్రమునకు చెందిన మద్యం సీసాలు గల 53 కేసులను ఆటోలోకి లోడింగ్ చేస్తుండగా ఎస్.ఇ.బి చీమకుర్తి ఎస్ఇబి వారిని అదుపులోనికి తీసుకోని విచారంచగా, వారిలో ఒకరైన తన్నీరు శబరిగిరి అనే వ్యక్తి హర్యానా స్టేట్ నుండి షేక్ జమీర్ అహ్మద్ ఏ బాషా అనే వ్యక్తి సప్లై చేసిన హర్యానా స్టేట్ మద్యం సీసాలను ఒక కంటైనర్ లో తెచ్చి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద వాటిని ఇద్దరు వ్యక్తులు అనగా మొరతోటి నాగార్జున మరియు కుంచాల ప్రవీణ్‌లతో కలిసి అన్లోడ్ చేసి ఆటోలో అధిక ధరలకు అమ్ము కోవడానికి చుట్టుప్రక్కల ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వారి వద్ద నుండి 53 కేసులలో ఒక్కక్కటి 750 ఎంఎల్ పరిమాణం గల ఇంపీరియల్ బ్లూ విస్కీ, రాయల్ స్టాగ్ విస్కీ, ఎంసీ మేగ్డోల్ నంబర్ వన్ విస్కీ బ్రాండ్లకు చెందిన మొత్తం 636 హర్యానా మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. మద్యం సీసాల విలువ సుమారు రూ.6 లక్షలు వుంటుందన్నారు. అలాగే వారి నుండి రవాణాకు వినియోగించిన ఆటోతో పాటుగా వారి నుండి నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైసీపీలో చేరిన వై.రామిరెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం : పట్టణ తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షులు ఏరువ రామిరెడ్డి వైసిపి పార్టీలోకి చేరారు. గురువారం రాత్రి పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైసిపి నియోజకవర్గ యువ నేత కుందూరు కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రామిరెడ్డికి కృష్ణమోహన్ రెడ్డి పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వై. రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడనై అలాగే మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్యే కె.పి నాగార్జునరెడ్డి సారథ్యంలో నడవాలని నిర?యించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు,మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎస్ కె.ఇస్మాయిల్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గోలమారి శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొత్త క్రిష్ణ, నాయకులు గుంటక చెన్నారెడ్డి, యమ్.ఉత్తమ్ కుమార్,యమ్.వెంకట రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-గిద్దలూరు : రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని శాసన సభ్యులు అన్నా రాంబాబు గురువారం అమరా వతిలో ఆయన నివాసంలో మర్యా ద పూర్వకంగా కలిశారు. నియోజక వర్గంలోని రాజకీయ పరిస్థితులు, పలు అభివృద్ధి పనులపై ఆయనతో చర్చిం చడం జరిగిందని తెలిపారు. ఈయన వెంట కంభం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, వైసీపీ నాయకులు హుస్సేనయ్య ఉన్నారు.

రామతీర్థంలో వేలంపాట

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం రామతీర్థం క్షేత్రం నందు జరగనున్న గంగమ్మ తల్లి తిరుణాళ్ళ సందర్భంగా కొబ్బరికాయల దుకాణాలు పూజలు సామాగ్రి దుకాణాలు ఏర్పాటు చేసుకొనుటకు మరియు కొబ్బరి చిప్పలు పోగుచేసుకొనుటకు ఈ నెల 18వ తేదీ శనివారం నాడు వేలం పాటను ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏబి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచినవారు కార్యనిర్వాహణాధికారిని సంప్రదించాలని కోరారు.

ఉపాధి పనులను టెలిగ్రామ్ యాప్‌లో నమోదు చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వివరాలను సిబ్బంది ప్రతిరోజు టెలిగ్రామ్ యాప్‌లో నమోదు చేయాలని ఉపాధి ఏపీఓ కె కొండయ్య అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో గురువారం టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల క్షేత్ర పర్యటనకు సంబంధించి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఏపీవో, ఈసీ, టి ఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయాన్నే 7.30గంటల నుండి 10 గంటల వరకు మండలంలో ఏదో ఒక గ్రామంలో పనులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి ఆ పనుల వివరాలను టెలిగ్రామ్ యాప్ లో నమోదు చేయాలన్నారు. పనుల వద్ద కూలీలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూడాలన్నారు. కూలీల మస్టర్లలో అవకతవకలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, జి అశోక్, జి మాలకొండా రెడ్డి, జి నాగరాజు, ఆర్ సుధాకర్, టీ షాలెం, జి రూతమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, వసంత జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్ష హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు సంస్కృతం, ఒకేషనల్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 219 మంది విద్యార్థులకు గాను, 207 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారు, పరీక్ష కేంద్రాన్ని పరీక్షల రాష్ట్ర పరిశీలికరాలు ఎం నాగమణి పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నారని తెలియజేశారు. దోర్నాల ఎస్ ఐ ఎన్ శ్రీనివాసరావు పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి కట్టుదిట్టగా ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

శెనగల కొనుగోలు ప్రారంభం

విశాలాంధ్ర-మద్దిపూడి : ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు శనగ కొనుగోలు ప్రారంభమైనట్లు ఏవో వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా సెనగల ధర రూ.5335గా నిర్ణయించబడిందని పేర్కొన్నారు. మద్దిపూడి, చీమట సొసైటీలో కొనుగోలు ప్రారంభమైందన్నారు. మద్దతు ధరకు శనగలు అమ్ముకునే రైతులు ఈ పంటను ముందుగా నమోదు చేయించుకోవాలన్నారు.

'ఈ-క్రాప్' బుకింగ్‌పై గ్రామ సభ

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని దద్దవాడ రైతు భరోసా కేంద్రం నందు అలసందలుపల్లి గ్రామంలో ఈ-క్రాప్ బుకింగ్ పై గ్రామ సభ మరియు సామాజిక తనిఖీ గురువారం నిర్వహించారు. 2023 రబి సీజనకు సంబంధించి పంట వేసిన ఒక ప్రతి ఒక్క రైతు పొలాలను సందర్శించి ఈ-పంట నమోదు చేయడం జరిగింది. గ్రామస్థాయిలో ప్రతి గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ క్రాప్‌కి సంబంధించిన జాబితాను రైతు భరోసా కేంద్రం నందు సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగింది. అనంతరం గ్రామ సభ నిర్వహించి ఈక్రాప్ జాబితాను చదవడం జరిగింది. రైతు సోదరులందరూ మీరు వేసిన పంటను యధావిధిగా బుకింగ్ చేశారా లేదా అని చూసుకొని ఏమైనా తప్పులు ఉంటే 1-2 రోజుల్లో సంబందిత గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసిన యెడల వారు తుది జాబితాలో మార్పు చేయగలరు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి మీరు వేసిన పంటను సరిచూసుకోవాలని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి కె. రాజశ్రీ, గ్రామ వ్యవసాయ సహాయకులు కె. హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

శనగల కొనుగోలుకు సూచనలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని తాటిచెర్ల మోటు కొనుగోలు కేంద్రాన్ని గురువారం మార్క్ ఫెడ్ డిఎం హరికృష్ణ అగ్రికల్చర్ ఏడిఏ బాలాజీ నాయక్ అగ్రికల్చర్ ఏఓ రాజశ్రీలు సందర్శించి శనగల కొనుగోలుకు సంబంధించిన పలు రకాల సూచనలు చేయడమైనది. తర్వాత కొమరోలుకు సంబంధించి మరియొక శపగల కొనుగోలు కేంద్రమునకు నూతనంగా నిర్మించిన ఆర్‌బీకె సెంటర్‌ను సెలెక్ట్ చేయడమైనది. ఈ ఆర్ బి కే సెంటర్ నందు కొమరోలు పరిసర గ్రామాల రైతుల దగ్గర నుంచి శనిగలను కొనుగోలు చేయాలని తెలిపారు. కొమరోలు ఆర్‌బికే సెంటర్‌ను శనివారం ప్రారంభించి శనివారం నుండి రైతుల దగ్గర నుంచి శనగల శాంపిల్స్ తీసుకొనబడును. అలాగే టోకెన్లు కూడా ఇవ్వబడును. కావున రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచు కోవాల్సిందిగా కోరారు.

నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడు బీఎంసీ

- టీడీపీ గెలుపే బీఎంసీకి నిజమైన నివాళి
- సంస్మరణ సభకు తరలివచ్చిన వేలాదిమంది

విశాలాంధ్ర-పామూరు : 2024లో జరుగు శాసనసభ ఎన్నికల్లో విజయం బేరి మోగించి కనిగిరి కొండపై టీడిపి జెండా ఎగిరే వరకు విశ్రాంతి లేకుండా శ్రమిస్తానని, బిఎంసి మరణం తెలుగుదేశం పార్టీకి, వ్యక్తిగతంగా నాకు తీరని లోటు అని కనిగిరి మాజీ శాసనసభ్యులు టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి శోక సప్త హృదయాలతో సంస్మరణ సభలో బొల్లా మాల్యాద్రి చౌదరి (బీఎంసీ)కి నివాళులర్పించారు. గురువారం బిఎంసి దశదినకర్మ సందర్భంగా శ్రీ మహాలక్ష్మీ మిల్క్ డైరీలో మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు అనుమతితో అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. టిడిపి అధికారంలోకి రావడం, కనిగిరిలో డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం బిఎంసి ఆశయమని, అది నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అని ఒంగోలు, గిద్దలూరు, ఆత్మకూరు, ఉదయగిరి మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ముత్తముల అశోక్‌రెడ్డి, కొమ్మి లక్ష్మీనాయుడు, బొల్లినేని రామారావు లు, చీరాల, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జిలు ఎంఎం కొండయ్య యాదవ్, ఎరీక్షన్ బాబు, పారిశ్రామికవేత్త కోటపాటి జనార్ధన్‌లు బిఎంసికి నివాళులు అర్పించారు. నీతికి నిజాయితీకి నిలువుటద్దం బీఎంసీ అని, ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం ఏ పార్టీలో ఉన్న నిబద్ధతతో పనిచేయడం బిఎంసి నైజం అని కొనియాడారు. బీఎంసీ కుమారుడు నరసింహారావుకు టిడిపిలో సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ అండగా ఉంటుందని, తండ్రి బాటలో నరసింహారావు నడవాలని కోరారు. సిపిఎం పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, జనసేన పార్టీ జిల్లా నాయకులు కరిముల్లా, బిజెపి రాష్ట్ర నాయకులు కొండిచెట్టి వెంకటరమణయ్య మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథ రామయ్య, భువనగిరి వెంకటయ్య, వాడి వెంకటేశ్వర్లు, దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, వేమూరి రామయ్య, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, సానికొమ్మ తిరుపతిరెడ్డి, పందిటి హరీష్, సయ్యద్ అమీర్ బాబు, యారవ ప్రసాద్‌రెడ్డి, డోలా శేషాద్రి, మన్నం రమణయ్య, షేక్ కాజా రహమతుల్లా పాలపర్తి వెంకటేశ్వర్లు, ఇర్రి కోటిరెడ్డి, దేవరపు మాల్యాద్రి, తూర్పు కోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్ దారపనేని జనార్ధన్, ఏలూరి వెంకటేశ్వర్లు, షేక్ గౌస్ బాషా నాయకులతో పాటు వేలాదిమంది సంస్మరణ సభలో పాల్గొని బిఎంసి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయములో ఆయన చిత్ర పటానికి జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్, పోలీస్ ఉన్నతాధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ కఠోర నిర్ణయంతో 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. ఆంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అహింసాయుత సత్యాగ్రహం ద్వారా ఆత్మ బలిదానం చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణతో పాటు భారతదేశంలో బాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడయినాడని, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు కృషి చేశారని, అందుకే ఆ మహోన్నత వ్యక్తిని స్మరించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. అమర జీవి కథ నేటి యువతరానికి మార్గదర్శకమై భవ్య భావోన్నత భవిష్య నిర్మాణానికి ప్రేరణ అని, ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియాదాసు, ఏఆర్ డిఎస్పీ వెంకటేశ్వరావు, డీపీఓ ఏఓ యం. సులోచన, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, ఏఆర్ ఎస్సైలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు టీఎంసీల నీరు మోపాడు రిజర్వాయర్‌కి కేటాయించాలి

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం అమరావతి సచివాలయంలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కలిసి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నుంచి మోపాడు రిజర్వాయర్‌కు రెండు టీఎంసీల నీటిని కేటాయించాలని కోరినట్లు వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, వైసీపీ మండల యువజన అధ్యక్షులు పామూరు పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణలు తెలిపారు. అలాగే ఆళ్ళ నాని కారుమంచి నాగేశ్వరరావు, భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులతో పాటు వివిధ శాఖల మంత్రులను కలిసి పామూరు మండల అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని విజ్ఞప్తి చేసినట్లు గంగసాని హుసేన్‌రెడ్డి, వెంకట సాయికిరణ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ షేక్ ఖాదర్ భాషా, గాజులపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం భావితరాలకు ఆదర్శం

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రధానోపాధ్యాయురాలు ఎల్ సుజాత కొనియాడారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి అయిన మహా పురుషుడు, సత్యము, అహింసా, హరిజనోద్ధరణ, అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన మహానుయుడు పొట్టి శ్రీరాములు అని చెప్పారు. ముండ్లమూరు ఎస్సై ఎల్ సంపత్ కుమార్ మాట్లాడుతూ మద్రాసు ఆంధ్ర ఉమ్మడి రాష్ట్రం నుండి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం రావాలని నిరంతరం నిర్విరామంగా, 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష వహించిన ధన్యజీవి, పురుషుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. 1901 మార్చి 16న మద్రాసు, జార్జ్ టౌన్, అన్నా పిళ్ళై వీధిలోని165 నంబర్ ఇంటిలో గురవయ్య మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారని వీరి పూర్వికుల స్వస్థలం కనిగిరి తాలూకా పడమటి పల్లె ప్రకాశం జిల్లాలో, 20 ఏళ్ల వయసు వరకు పొట్టి శ్రీరాములు విద్యాభ్యాసం మద్రాస్ లోనే జరిగిందన్నారు. కెల్లంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోగుల కోటేశ్వరరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు రాష్ట్రంలోనే గొప్ప వ్యక్తి అని, ఎంతో పట్టుదల, పోరాట పటిమ కలిగిన యోధుడని కొరియాడారు. ఏదైనా పని చేయాలంటే దాన్ని సాధించేవరకు పోరాటం చేసే వ్యక్తి అని అన్నారు. షేక్ హజరత్ ఆలీ, జి.భావన్నారాయణ, నరసింహారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, జె జ్యోతి, చక్రపాణి, బాబురావు, విజయనిర్మల, భారతి, శ్రీదేవి, ఎన్ ప్రభావతి, కొంజేటి సురేష్ బాబు, పాలపర్తి మావో, దాసరి శ్రీనివాసులు, అనితాస్వాతి, పాలేపోగు డగ్లస్, శిఖకొల్లి సుబ్బారావు, పులికొండ శ్రీనివాసరావు కనగండ్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ గురుకులం - సరికొత్త ప్రచారం

విశాలాంధ్ర-అర్ధవీడు : మనసుంటే మార్గం వుంటది అంటారు. ఈ సూక్తిని స్థానిక డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల యాజమాన్యం ఆచరణలో నిరూపించింది. 2023-2024 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశాలకు వినూత్న పద్ధతిలో ఆహ్వానం పలికింది. సోషల్ మీడియా వేదికగా కార్పొరేట్ తరహా ప్రచారం చేపట్టింది. గురుకులంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే విధానం, ఇతర అకడమిక్ యాక్టివిటీసుతో పాటు, వారి కోసం ప్రభుత్వం ఉచితంగా అందించే సౌకర్యాలను డిజిటల్ పోస్టర్లో ఆకర్షణీయంగా పొందు పరిచి ప్రిన్సిపాల్ బి బలరామిరెడ్డి పేరుతో సామజిక మాధ్యమంలో ప్రచారం చేస్తున్నారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం చదవ గోరే విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులకు ఈ నెల 24 వ తేదీ గడువుగా ప్రకటించారు. ఏప్రిల్ 23వ తేదీ 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుండి 12 గంటలవరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

అమర జీవికి ఘన నివాళి

విశాలాంధ్ర-తాళ్లూరు : అమరజీవి పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినదిస్తూ ఆయనకు ఘన నివాళులర్పించారు. మండల నేతలు, అధికారులు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మండల కేంద్రమైన తాళ్లూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసి మారం వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి ఇతర నాయకులు, అధికారులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ బయట ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కొరకు తన ప్రాణాలను సైతం అర్పించి ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని అందించిన ఘనత అమరజీవి పొట్టి శ్రీరాములు దేనని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటిసి మారం వెంకటరెడ్డి తదితరులు అన్నారు. ఆయన ఆంధ్రుల హృదయాలలో అమరజీవిగా ఉంటారని వారు కొనియాడారు. మండల కోఆప్షన్ సభ్యులు కరీముల్లా, తాళ్లూరు గ్రామ సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, మల్కాపురం సర్పంచ్ ఎస్.కె కాలేశా వలి, సూపరిండెంట్ శ్రీనివాసరావు, ఎంఈఓ జి సుబ్బయ్య, ఈఓఆర్‌డి ప్రసన్నకుమార్, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు, వైసీపీ గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ పరిహారం అందాలి

కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల నిర్వాసితులవుతున్న ప్రతి కుటుంబానికీ పరిహారం అందేలా సంబంధిత పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఈ విషయంపై సంబంధిత అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను గుర్తించడానికి 2002 మంచి 2005 వరకు అందుబాటులో ఉన్న అన్ని డాక్యు మెంట్లను మరోసారి పరిశీలించాలని చెప్పారు. తాము కూడా నిర్వాసితుల మేనంటూ 1127 కుటుంబాలు సమర్పించిన పత్రాలను కేటగిరీల వారీగా పరిశీలించాలని ఆదేశించారు. పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ ప్యాకేజీ పొంద దానికి అర్హులైన వారు చనిపోతే వారి నామినీల పేరుతో పరిహార ప్యాకేజీలను తయారు చేయాలని, అర్హుల జాబితాలో చేర్చాలంటూ వచ్చిన 137 ఫిర్యాదులను కూడా మరోసారి.. పరిశీలించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.అభి షిక్ కిషోర్ మాట్లాడుతూ గొట్టి పడియ, గుండంచర్ల వాసులకు పరిహార ప్యాకేజీలకు ఆమోదం లభించాక ఇళ్ల పట్టాలు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళా వందనం పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ పక్రియ వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలని సచివా లయాల సిబ్బందిని కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ అంగన్ వాడి కేంద్రాలలోని చిన్నారులందరికి ఆధార్ నమోదు చేయాలని చెప్పారు. జిల్లా జనాభాలో 97 శాతం ఆధార్ కార్డులు ప్రజలకు ఉన్నాయని మిగిలిన వారందరికీ కార్డులు ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో 57 సచివాల యాలలో ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని ఆ కేంద్రాల్లో నవీకరణ ప్రక్రియ కొనసాగించాలన్నారు. అంగన్‌వాడి కేంద్రాలలో 75,680 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు లబ్ధి పొందుతు న్నారని వారందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డుల ఇవ్వాలన్నారు. 25,790 మంది చిన్నారులను ఆధార్‌లోకి తీసుకువచ్చారని వారందరికి పేర్లు, వేలి ముద్రలు తీసుకోవాలన్నారు. మిగిలిపోయిన 49,890 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు లేవన్నారు. జిల్లాలో 1888 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు కనీసం 30 కేంద్రాలలో 1710 మంది చిన్నారుల వివరాలను ఆధార్ కార్డుల వెబ్ సైట్లోకి నిక్షిప్తం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదేళ్ల తరువాత తప్పనిసరిగా నవీకరణ చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఓ జి.భరత్ కుమార్, ఆధార్ జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్ బాబు, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేట్ పాఠశాలల్లో 25 శాతం పిల్లలకు ఉచిత విద్య అందించాలి

జిల్లాలో విద్యా హక్కు చట్టం క్రింది ప్రవేట్ పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం బాపట్ల కలెక్టర్‌లో పాఠశాల యాజమాన్యంతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ జిల్లాలో ప్రవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం క్రింద 25 శాతం ఆర్థికంగా వెనుకబడిన ఎస్.సి,ఎస్. టి.బి.సి, మైనార్టీ పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. ప్రవేట్ పాఠశాలల్లో పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించాలన్నారు. ప్రవేట్ పాఠశా లలు నేటి సాయంత్రంలోగా రిజిస్ట్రేషన్ చేయుంచుకోవా లని ఆదేశాలు ఇచ్చామన్నారు. పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని తెలియజేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో హెల్ప్ డెస్క్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ చేపట్టాలన్నారు. పిల్లలకు చిన్న వయస్సు నుండే క్రమశిక్షణ నేర్పాలన్నారు. పిల్లలపై అత్యాచారాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు కూలీలకు తీవ్రగాయాలు

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలంలోని బెల్లంపల్లి గ్రామంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్ ప్రమాదంలో 6 మంది కూలీలకు అంగవైక్యం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజుపాలెం గ్రామానికి చెందిన మిర్చి కూలీలు నదిగడ్డ గ్రామానికి మిర్చి కోతకు ఆటోలో వెళ్తున్నారు. వెళ్ళంపల్లి గ్రామ సమీపంలోని వెళ్ళే సరికి వెనుకగా వస్తున్న లారీ దీకొనడంతో ఆటోలో వున కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు సహాయంతో 108, హైవే అబులేన్స్ సహాయంతో క్షతగాత్రులను వైద్యశాలకు తరలిం చారు. అందులో వున బొమ్మిరెడ్డి సీతమ్మకు తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి వీరిని మెరుగయిన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. పుట్ట నాసరమ్మకు రెండు కాళ్ళు విరిగాయి. తిరుపతి వెంకటేశ్వర్లును యర్ర గొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించరు. అంకమ్మకు కూడా కాళ్ళు విరిగాయి. బ్రహ్మంగారి మఠం నుండి బతుకుదెరువు కోసంవచిన కొమ్మూరి నరసింహ కాళ్ళు వీరిగాయి. వీరిని వినుకొండ వైద్యశాలకు తరించారు. వీరితో పాటుగా మరికొందరు కూలీలకు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న యస్ ఐ వెంకట సైదులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీఎంసీ సంస్మరణ సభలో పాల్గొన్న మాధవ ప్రసాద్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : పామూరు పట్టణ టీడీపీ సీనియర్ నేత మాజీ జడ్పీటీసీ బొల్లా మాల్యాద్రి చౌదరి సంస్మరణ సభ కార్యక్రమానికి నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాముల పాటి మాధవ ప్రసాద్ హాజ రయ్యారు. గురువారం పామూరులో శ్రీ మహాలక్ష్మి డైరీ ఆవరణలో జరిగిన సంస్మరణ సభకు మాధవప్రసాద్ హాజరై బీఎంసీకి ఘన నివాళులు అర్పించారు. మాధవప్రసాద్ మాట్లాడుతూ మంచికి మారుపేరైన జననేత టీడీపీ సీనియర్ నాయకులు బీఎంసీ హఠాన్మరణం తనను కలిచివేసిందని అన్నారు. వారి కుటుంబ సభ్యులు మనో ధైర్యంతో ఉండాలని అన్నారు. ఈ కార్య క్రమంలో చావా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ వీసీని సస్పెండ్ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు టి.అరుణ

విశాలాంధ్ర-ఒంగోలు : ఉన్నత చదువుల విశ్వ విద్యాలయంలో ఉన్నత పదవిని నిర్వహించే ఒక వైస్ ఛాన్సలర్ తన సమక్షంలో విపరీత ధోరణులు ఉన్న రామ్ గోపాల్ వర్మ లాంటి వ్యక్తి వ్యాఖ్యలు వింటూ ఖండించకపోగా, అతనొక తాత్వికుడని ప్రశంసించటం దురదృష్టం అని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. స్త్రీలను,వారి ఆత్మాభిమానాన్ని అతి హీనంగా కించ పరచటంతో పాటు, తిని, తాగి, తిరుగుతూ చదువును నిర్లక్ష్యం చేయ మంటూ విద్యార్థులకు సందేశం ఇవ్వడం పట్ల ఆమె అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా ఆమె ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె ఈ సంఘటనపై విచారణ జరిపించాలని, వైస్ ఛాన్సలర్‌ని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని, రామ్ గోపాల్ వర్మ మీద వెంటనే కేసు బుక్ చేసి, అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ విషయంపై యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు అందరూ నిరసన వ్యక్తం చేయాలని, నరసం ప్రతి జిల్లాలోనూ ఈ విషయంపై సభలు సమావేశాలు నిర్వహించాలని నరసం రాష్ట్ర ఉపాధ్య క్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి అన్నారు. నరసం జిల్లా ఉపాధ్యక్షు రాలు మారేపల్లి సూర్యకుమారి, నరసం ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి కృపావరం, జిల్లా గౌరవాధ్యక్షురాలు ఝాన్సీదుర్గ, బీరం అరుణ, మహిళా నాయకు రాలు నాళం నరసమ్మ పాల్గొన్నారు

అమరజీవి పొట్టి శ్రీరాములు కృషి ఎనలేనిది

- ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ

విశాలాంధ్ర-దొనకొండ: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి ఎనలేనిదంటూ ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణార్పణ చేసిన ఆ మహనీయుని స్మరించటం తెలుగు వారందరి బాధ్యత అంటూ ఆయన జీవిత చరిత్రను వివరించారు. అంతటి త్యాగమూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ కోరారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఎంఈఓ ఎన్. సాంబశివరావు, ఈఓఆర్‌డీ ఎస్.డేవిడ్, కార్యదర్శులు పి.క్రిష్ణ మూర్తి, మన్నె శ్రీనివాస్, వివి రామాంజనేయులు, రాచగొర్ల బోడయ్య, సిబ్బంది పాల్గొన్నారు.